
శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# రుక్మిణీ కళ్యాణం



**మూలం : బమ్మెర పోతన**

(అనుసరణ) రచన :

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



**రుక్మిణీ కళ్యాణం**

మొదటి ప్రచురణ

ఏప్రిల్ 2009

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109



## ముందుమాట

రుక్మము అంటే **'బంగారము'** అని అర్థము. రుక్మిణి అనగా బంగారము వంటి శ్రేష్టమైన గుణము కలది అని భావము. **'కృష్ణ'** అంటే నల్లని అని సాధారణమైన అర్థమున్ననూ కృష్ణుడు అనగా ఆకర్షించువాడని అర్థం కూడా ఉన్నది. బంగారంవంటి గుణములు కల దానిని ఆకర్షించువాడు ఇంకెవరు? శ్రీకృష్ణుడే కదా!

ఆమె జీవాత్మకు ప్రతీక. జీవాత్మ పరమాత్మతో కలయిక చెందుటే మోక్షము. అదే రుక్మిణీ కళ్యాణం. పైకి నాయికా నాయకుల ప్రణయగాధగా కనిపించినా నిజమునకిది జీవాత్మ మోక్షము నొందుటను వివరిస్తుంది. జీవాత్మ తను పరమాత్మనుండి ఆవిర్భవించినదవుటచే దీని లక్ష్యం ఆ మోక్షమే కదా!

జీవుని మోక్షప్రాప్తికి అరిషడ్వర్గాలైన కామ క్రోధ మోహ లోభ మదమచ్చరములు అడ్డుపడుతుంటాయి. రుక్మిణికి కూడా కృష్ణుని చేరుకోవటానికి ఐదుగు



రన్నదమ్ములు మరియు శిశుపాలుడు అడ్డంపడ్డారు. భీష్మకుడు ఆమె తండ్రి. మంచివాడే, కాని అశక్తుడు. జీవాత్మకుకూడా అనిశ్చయం (ఊగిసలాట) అనే భీష్మకుని వంటి తండ్రి అరిషడ్వర్గాలకు అణిగియుండునట్లు చేసినందువల్ల జీవాత్మకు అన్యాయం జరుగుతుంది.

రుక్మిణి, అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుని సహాయం కోరి తన మనసు కృష్ణునికి నివేదించమన్నది. జీవాత్మ పరమాత్మని చేరాలంటే అగ్నిదద్యుతనుడిలాంటి నిష్కామ కర్మ బోధించే గురువు సహాయం కావాలి. గురువు, పరమాత్మకు జీవాత్మ ఆవేదన నెరిగించి ఆ పరమాత్మనే జీవాత్మ వద్దకు తెస్తాడు.

స్వామీ అరిషడ్వర్గముల నెదిరించుటకు నా అశక్తత అర్థంచేసుకో ఆ శక్తిని నీవే ఇవ్వాలని జీవాత్మ పరమాత్మను వేడుకుంటే ఆయన ఉరుకుల పరుగులతో వస్తాడు. రుక్మిణీ కళ్యాణం జరుగుతుంది, మోక్షం సిద్ధిస్తుంది.

ఇదివరలో నేను 'గజేంద్రమోక్షం' కథను నాకు తెలిసిన సరళ తెలుగు భాషలో పోతనామాత్యుని భాగవత

కథ ఆధారంగా వ్రాశాను. పోతనగారి అద్వితీయమైన, నాకిష్టమైన, కొన్ని పద్యాలను వృత్తములలో మార్పులు చేసి తాత్పర్య సహితంగా వ్రాశాను. కేవలం నా తృప్తికే అలా చేసినా నా ఉద్దేశ్యం మాత్రం పోతనగారి రచనా చమత్కారం చదువరికి తేలిక భాషలో తెలియజెప్పటమే.

అదే స్ఫూర్తితో నేడు ఈ విధంగా రుక్మిణీ కళ్యాణం కూడా మీకు అందిస్తున్నాను. అదే ధ్యేయంతో వ్రాసిన ఈ రచన చదువరికి ఆనందాన్నిస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

సినిమాల్లోను, టీవీల్లోనూ రోజూ చూస్తున్నదే కదా! మళ్ళీ చదివి అవస్థ పడడం ఎందుకు అనుకునే వారికి ఒక చిన్నమాట. సినిమాల్లో కృష్ణుణ్ణి చూసి మన మనసు చూసేది ఆ పాత్రధార్నే అనుకుంటుంది కాని పరమాత్మ అనుకోదు. మనం పోతనగారి భాగవతం చదివితే



మనకళ్ళు ముందు అదే పాత్రధారి కృష్ణుడిగానే కనబడతాడు కాని నిజజీవితంలో ఆ పాత్రధారిగా కాదు.

"కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్...."

అని మనం చదువుతుంటే మన కళ్ళముందు కృష్ణుడుంటాడు. అందుకనే భక్తి కుదరాలంటే పుస్తకాలు చదవాలి. సినిమా చూస్తే లాభం లేదు.

కంప్యూటర్ యుగంలో ఉన్న మనం ఆనాటి గ్రంధాలు చదివి అర్థం చేసుకునే శక్తిని నెమ్మదిగా పోగొట్టుకొన్నాం. మన పూర్వ కవుల కవితా మాధుర్యం అర్థం చేసుకుని ఆనందించగల శక్తి కోల్పోయాం. కాల ప్రవాహానికి ఎదురీదడం ఎవ్వరి తరము కాదు. ఒకప్పుడు చెయ్యి పట్టుకుని నాడి చూడగలిగి అనుభవంతో వచ్చిన జ్ఞానంతో వైద్యం చేశారు. ఈనాడు యమ్.డి.డి.యమ్ అయితే గాని మంచి డాక్టరు కాదనుకొంటున్నారు.



ఒకప్పుడు కుటుంబ సాంప్రదాయం చూసి పిల్లనిచ్చి వివాహం చేస్తే, ఈనాడు ఆస్తీ, పలుకుబడి, పిల్ల సంపాదన చూసి పెళ్ళి చేస్తున్నారు. వ్యాపార దృష్టితో చేసేదేంట్లో నైనా లాభ నష్టాలుంటాయి. 'సర్దుబాట్లుంటా'యి. సమస్యలుంటాయి. ఆనాటి రుక్మిణీ కళ్యాణం జీవాత్మ పరమాత్మ అనుసంధానమైతే ఈనాటి **'రుక్మిణీ కళ్యాణాలు'**, అడ్వర్‌టైజ్‌మెంట్స్‌తోనో, ఇంటర్‌నెట్స్‌లోనో, పార్టీల్లోనో మొదలై అమ్మాయికో అబ్బాయికో లేక ఇద్దరికో ఉద్యోగం వచ్చాక ఫిక్స్ అయి పెళ్ళి స్నేహితుల 'దయ' వలన జరిగి పెద్దలు విధిలేక ఒప్పుకొని రాజీకొచ్చి జరుగుతున్నాయి.

ఈ వ్యవస్థ గురించి విమర్శించడం నా అభిమతం కాదు. ప్రతి వధువు రుక్మిణిలాగ నాకు నా భర్త తప్ప ఇంకేదీ వద్దు అనుకోవాలి. అమ్మా నాన్న అన్న మొదలైన వారెవ్వరైనా నాకు నా భర్త తరువాతనే అనుకోవాలి. ప్రతి వరుడూ శ్రీకృష్ణునిలాగా నా భార్యకోసం ఎంత శ్రమ (రిస్క్) నైనా అనుభవిస్తాను. ఎట్టి సమస్యనైనా ధైర్యంగా



ఎదుర్కొంటాను అనే నమ్మకం పెంచుకోవాలి. ఆనాడే ఈ నవీన నాగరిక రుక్మిణీ కళ్యాణాలు విజయవంత మవుతాయి.

శ్రీరామచంద్రుడు, వాసుదేవుడూ, బుద్ధుడూ, రాఘవేంద్రస్వామి మొదలైన అవతార పురుషుల చరిత్రలలోని ఔన్నత్యం అర్థంచేసుకొని అనుసరించాలిగాని, వితర్కించి వాళ్ళు భార్యలకి అన్యాయం చేసిన కీర్తి కాముకులని భావించరాదు.

అలాగే రుక్మిణీదేవి ప్రణయ గాధను పరమాత్మ తత్త్వంతో అర్థం చేసుకోవాలి.

నా రచనలోనన్నింటినీ www.geetadeeksha.com అనే వెబ్‌సైట్‌లో చదువవచ్చు. తెలియని అనేక విషయాలు తెలుసుకోవచ్చు.

# ప్రార్థన

కం॥ శ్రీరమణి ద్వాపరంబున
చేరెను భువి రుక్మిణాయె శ్రీకృష్ణుని తాన్
కోరెను పరిణయమాడెను
ఆ రుక్మిణి పెండ్లిగాథ హరికృప జెబుదున్.

ఆ॥ అష్టభార్యలున్న హరి పెద్ద భార్యంట
సుగుణ గనికి సాటి సుదతి లేదు
అఘములన్నితొలగనందింతు గతజన్మ
పుణ్యవశము జేత బూనినేదు.

ఆ॥ వెదకి వరుని సుతకు విసుగుజెందినవారు
తొల్లి ప్రజలదారి దొరక'బట్టి'
భక్తితోటి దీని పఠియింపజేయుడు
పరిణయంబు జరుగు బాలికలకు.



ఉ॥ నీరవమందునన్ గలదు, నింగిని, కుంభిని,
వాయుమండలిన్,
ఆ రవిచంద్రులన్ గలదు, అగ్నిని, రేబవలందు
నైననున్
కూరిమి నుండెనా ప్రణవ ఘోష, త్రిమూర్తి,
త్రిలింగవ్యక్తులన్
చేరుచు యెక్కడైన హరి సేమమునుండును
శంకయేటికిన్

శా॥ రాజీవాక్షడు రామచంద్ర విభునాలక్ష్మే
వరించెన్ తనే
భూజాతై, మరు జన్మమందు వెలసెన్ పూబోడి
వైదర్భియై
ఏజన్మైనను నాదు భర్తయని తానెంచెన్
జగన్నాధునిన్
ఆ జంటన్ యొక బ్రాహ్మణుండు కలిపెన్ ఆ గాథ
హృద్యంబహో!



చం॥ వెతుకుట నీదువంతు, గతిపేర్మిని జూపుట
వానివంతు, ఆ
హితుని మురారి జూచుటకు ఇచ్చట నచ్చట
దేవులాడకన్
అతనిని నెమ్మదిన్ నిలిపి ఆర్తిని జూపుము
నీదు గుండెలో
స్థితుడగు, నమ్ముడీపలుకు శ్రీహరి దూరము
దుష్టబుద్ధికిన్

కం॥ నీవారలెవరు స్వామీ!
నీవాడెవ్వండు కాదు నీవారమయా
నీవింక జాగు సేయకు
నీవే రక్షింపదగును నీరజనాభా!



సీ॥ తులువకు సిరులన్ని పలుమార్లు అందించు
కదగండ్ల భక్తుని గలతవెట్టు,
చదువు నేర్పెడి వాన్కి చవట బిడ్డల నీయు
"బడి" గాల్చు దుర్మతి బడయు గీర్తి,
నిత్యపూజలు సేయు నెలతకుండదు శాంతి
వెలయాలు 'రాణి' యై 'తలలు మార్చు'
సుందరాకారుండు సొక్కును రోగాల
కోటీశ్వరుడు కూడు గుడువలేడు

తే॥ విష్ణుమాయ దెలియు వేత్త ఎవ్వండురా?
మూడు జగములందు లేదు లేదు
పూర్వజన్మ ఫలము బూని గట్టుట జేత
వింతలన్ని జరుగు విదితమవదు

# అంకితం

మన అందరి అమ్మ అయిన అలమేలు మంగమ్మకు



చం॥ జగముల నాథుడౌ పతిని చక్కదనంబున గట్ట
లేము, ఆ
మగని వరించు వారలును వందలకోట్లకు
మించియుండుటన్
తగునని స్వామి గుండియల దగ్గర నుంటివి
మంగతాయి! నీ
తెగువను జూపు ఈ రచన తేకొని అంకితమిత్తు
భక్తితో



తా॥ ఓ తల్లీ! అలమేల్ మంగమ్మా! నీ భర్తయైన శ్రీవేంకటేశ్వరుడు జగన్నాథుడు. ఆయనను అందచందాలతో కొంగున ముడివేసుకోలేము. ఆయన కావాలనుకొనేవారి సంఖ్య వందల కోట్లకు మించి ఉన్నది. ఇక ఇట్లా కాదని ఆ స్వామి గుండెల్లోనే స్థిరపడిపోయావు. నీధైర్యం ఎవరికుంటుంది చెప్పవమ్మా! ఇదిగో రుక్మిణీ దేవిగా ఆనాటి నీ ధైర్యాన్ని నిరూపించే ఈ రచన భక్తితో మ్రొక్కి నీకు అంకితమిస్తున్నాను. స్వీకరించు తల్లీ!



# రుక్మిణీ కల్యాణం

శ్రీకృష్ణ బలరాముల వివాహగాథ నెరింగింపు అవసరంబున శుకమహర్షి పరీక్షిత్తున కిట్లనియెను. ‘ఓరాజా! ఆ బ్రహ్మదేవుని నిర్ణయము ప్రకారము రైవత మహారాజు తన కుమార్తె రేవతిని శ్రీకృష్ణుని అన్నయైన బలరామునికిచ్చి వివాహము చేయ నిశ్చయించెను.

(రేవతి కృతయుగము నాటి కన్య. అందులోనూ ఆమె జన్మించి ఇరువది ఎనిమిది మహా యుగములైన పిదప ఇరువది తొమ్మిదవ మహాయుగమున జరుగుచున్న ద్వాపరయుగము నాటి బలరామునికిచ్చి పెండ్లి చేయవలెను. ఆ నాటి యుగధర్మము ప్రకారము రేవతి ఎత్తు ఇరువది యడుగులు. బలరాముని నాటి ద్వాపర యుగ ధర్మము ప్రకారము అతని ఎత్తు పన్నెండు అడుగులు మాత్రమే. ఈ ‘పొట్టి’ వరునికి ఆ ‘పొడుగు’ భార్యకు జత



ఎట్లు? బలరాముని తండ్రియైన వసుదేవుడు బ్రహ్మ నిర్ణయము కాదనలేక తన చిన్న పుత్రుని శ్రీకృష్ణుని ఏమి చేయుదుమని అడిగెను. శ్రీకృష్ణుని సలహాపై బలరాముడు తన ఆయుధమైన నాగలిని ఉపయోగించి ఆమె పొడుగు తన ఎత్తునకు తగిన రీతిని కుదించెను.

పిమ్మట వారిరువురకు బ్రహ్మ ఆశీర్వాదములతో వివాహమాయెను. ఆ తరువాత......

తొల్లి గరుత్మంతుడు తన తల్లి దాస్యనిర్మూలనకై దేవేంద్రుని గెలిచి అమృతము దెచ్చినట్లు శ్రీకృష్ణుడు శిశుపాలుని వాని మిత్రులైన సాల్వుడు మొదలైన నీచ రాజన్యులను గెలిచి, లక్ష్మీదేవి అంశమున జన్మించిన సుగుణఖని, బీష్మకుని పుత్రి, యౌవనవతియైన రుక్మిణి అను చిన్నదానిని దెచ్చి పరిణయమాడెను.

శుకుడట్లనగా పరీక్షిత్తు **‘ఓమునీంద్రా! కృష్ణుడు**

**సాల్వాది రాజులనోడించి శిశుపాలినికి కాకుండా రుక్మిణి నవహరించి, రాక్షస వివాహమాడుటకు ఎట్లుగొనిపోయెను? అదియునూ గాక....'**

**"ఓ శుకమునీంద్ర! మనసున దురాలోచన లేని ఏ సజ్జనుడు హరికథలను వినుచూ వద్దు ఇక చాలు అనును? విన్న కొలదీ ఆ గాథలు వినాలనిపించును గదా! అందుచేత నాపై కృపజూపి ఆ రుక్మిణీ కళ్యాణ గాథ నెరింగింపుము విని ధన్యుడనౌదును"** అన్నాడు.

ఆ రాజునకు శుకుండిట్లనెను.

ఓ పరీక్షిన్మహారాజా! వినుము. విదర్భ దేశమునకు రాజధాని 'కుండిన నగరము' భీష్మకుడు దాని రాజు. 'రుక్మి' మొదలైన ఐదుగురు కొడుకుల తరువాత ఆయనకు రుక్మిణ అను పుత్రిక పుట్టినది. రుక్మి అతని సంతానములో పెద్దవాడు.



బాలికయైన రుక్మిణి జన్మించుట వలన ఆ భీష్మకుని రాజమందిరము, శుక్లపక్షచంద్రరేఖ కాంతితో దినదినమునకూ హెచ్చినట్లు పడమటి దిక్కు వెలుగుల వలె విశేషముగా ప్రభవిల్లెను. ఆమెపేరే రుక్మిణి అనగా బంగారమువంటి గుణము కలది. అట్లు ఆమె దినదిన ప్రవర్ధమానమై పెరుగుచుండెను.

రుక్మిణీ బాల, బొమ్మల పెండ్లిండ్లు జేయుచు తోటి బాలికలతో వియ్యములాడెడిది. గుజ్జనగూళ్ళ ఆటలలో చెలులకు చిన్ని చిన్న వంటలు చేసి తినబెట్టెడిది. పాదులకు నీరుబోసి అందమైన పూలతోటలో మొక్కలు పెంచెడిది. మణిమయ భవంతులలో బంగారు తూగుటుయ్యాల లూగెడిది. మరియొకప్పుడు చిలుకలకు గోరింకలకు మాటలు నేర్పెడిది. నెమళ్ళకు అందముగా నడచుట ఎట్లో నేర్పెడిది. హంసలకు మందయానము అనగా మెల్లగా నడచుట ఎట్లో రోజూ నేర్పెడిది.



(నాటి బాలికల పెంపునకు నేటి బాలికల పెంపునకు భేదము గమనించండి పూదోటలలో వచ్చే సువాసనా భరితమైన గాలి ఒకటైతే మహానగరాలలో ముక్కులు బద్దలయ్యే మోటారు వాహనాలు ఎగజిమ్మే కాలుష్య భరితమైన గాలి ఇంకొకటి) అంత....

సీ॥ **మురవైరి కోర్కెలు మొగ్గలు తొడవంగ**
**తనువు తీగై సాగె తరుణికిచట**
**పద్మనాభుని చిత్తపద్మంబు వికసింప**
**ముఖపద్మద్యుతి హెచ్చె ముదితకిచట**
**మధుసూదనుని మదిన్ మదన తాపము తోప**
**చనుగవ బరువాయె చానకిచట**
**హరిమది ధైర్యంబు హరియింపబడునట్లు**
**నడుము క్షీణించెను నాతికిచట**



తే॥ **ప్రేమ చిగురించె నెమ్మదిన్ శ్యామలాంగు**
**నికిని, బాలకు సిగపాయ నిగ్గుదేలె**
**మనసు ముదముతో నిండగా మాధవునికి**
**యౌవనము నిండి రుక్మిణి అందమెసగె**

**(పోతనగారి 'దేవకీసుతు కోర్కె' ఆధారంగా....)**

తా॥ (ఎవ్వరికైనా పాపాయి దశనించి బాలదశ రాగానే బుద్ధి ఆలోచన వికసించటం మొదలవుతుంది. ఇక్కడ కృష్ణునికి అక్కడ రుక్మిణికి ఆ దశలెలా గడుస్తున్నాయో చూడండి) ఇక్కడ, మురారియైన కృష్ణుని కోర్కెలు చిగురిస్తుంటే; అక్కడ రుక్మిణి శరీరం తీగెలాగ పెరుగుట మొదలెట్టింది. పద్మనాభుడు శ్రీహరియైన కృష్ణుని మనస్సనే పద్మం వికసిస్తుంటే అక్కడ రుక్మిణి ముఖపద్మంయొక్క కాంతి పెరిగిపోయింది. ఇక్కడ మధుసూదనుడైన కృష్ణునికి యవ్వనంలో కలిగే మదనతాపం కలుగుతుంటే

అక్కడ రుక్మిణీదేవికి యౌవనంతో వక్షోజముల బరువు పెరిగింది. ఇక్కడ కృష్ణుని మనోధైర్యం సన్నగిల్లుతుంటే అక్కడ రుక్మిణికి నడుము సన్నబడి క్షీణించి పోతున్నది. నల్లని అవయవములతో అందగాడైన కృష్ణుడి మనస్సులో వలపులు మొగ్గలు తొడుగుతుంటే అక్కడ రుక్మిణి జుట్టు నల్లగా ఒత్తుగా పెరిగింది. ఇక్కడ మాధవునికి ఆనందంతో మనస్సు ఉరకలు వేస్తుంటే అక్కడ రుక్మిణికి యౌవనంతో అందం ఇనుమడించింది.

ఇట్లు రుక్మి, రుక్మధరుడు, రుక్మబాహుడు, రుక్మకేశి, రుక్మమాలి అను ఐదుగురు అన్నల ముద్దు చెల్లెలై రుక్మిణీ దేవి తన యౌవన ప్రాంగణమున అడుగిడెను.

ఆ రుక్మిణీ దేవి తన తండ్రి ఇంటికి వచ్చు అతిథుల మాటల ద్వారా శ్రీకృష్ణుని అందచందములు, ధైర్య సాహసములు, శక్తి సామర్థ్యములు, దుష్ట శిక్షణా దీక్షా



పరతంత్రత వంటి గుణములనెరింగి, అతడే తనకు సరియైన భర్త అని నిర్ణయించుకొనెను.

శ్రీకృష్ణుడు కూడా రుక్మిణి అందచందముల గురించియే గాక మంచి బుద్ధిగల సద్గుణ శీలయనియు, సద్వర్తనయేగాక సాముద్రిక శాస్త్రములో, చెప్పబడిన శుభ లక్షణములుగల ఆమెను చేబట్టుటకు ఉత్సాహ పడుచుండెను.

అప్పుడు...

రుక్మిణి తల్లిదండ్రులకు తక్కిన బంధువులకు ఆమె కృష్ణుని పెండ్లియాడు తలంపు సమ్మతమై అందరూ ఆనందించిననూ ఆమె పెద్ద అన్నయైన రుక్మి ఇందుకు విరుద్ధముగా ఆలోచించు చుండెను. అతడు తన మిత్రుడును, చేది దేశపు రాజైన శిశుపాలునికి తన చెల్లెలినిచ్చి పెండ్లి చేసెదనని వాగ్దానము చేసియుండెను. అతను బహు పట్టుదలగలవాడు, మరియూ మొండివాడు.



**చం॥ మనసున అన్న యెత్తుగడ మానినెరింగెను**
**చింత ఇబ్బడై**
**తను గ్రహియించి యాపదను, దగ్గర బిల్చెను**
**ఆమెకాప్తుడై**
**వినయము విజ్ఞతల్ కలుగు విప్రునికిన్ తమ**
**రుక్మియోచనల్**
**వినుమని జెప్పి గావుమని వెన్నుని వద్దకు**
**బంపె బేలయై**

**(పోతనగారి "అన్న తలంపు తానెరిగి" అను పద్యం ఆధారంగా)**

తా॥ ఆ రుక్మిణీదేవి తన అన్న రుక్మి మనస్సులో ఎత్తుతున్న పన్నాగం గ్రహించినదై, విచారం రెండింతలై, జరుగబోయే విపత్తునర్థంచేసికొని, ఆమెకు ఆప్తుడైన వాడును, విజ్ఞానవంతుడును, వినయము



గలవాడును అయిన బ్రాహ్మణుని ఒకనిని తనదగ్గరకు పిలిపించుకొని, వినుమని తన అన్నగారి దుర్మార్గపు ఆలోచనల నెరింగించి, తనను కాపాడమని శ్రీకృష్ణునర్థించుటకై బేలయై శ్రీకృష్ణుని వద్దకు బంపెను.

**ఓ విప్రోత్తమా! మా తండ్రి భీష్మకుడు తనకిష్టమైననూ, మా అన్న రుక్మిమాట కెదురాడలేక మా బంధువుల సమ్మతిని నా ఇష్టమును తిరస్కరించి నన్ను దుర్మార్గుడైన శిశుపాలునకిచ్చి పెండ్లి చేయవలెనని యోచించుచున్నాడు. నీవు నా ప్రేమ కృష్ణునిపై కలదని స్వామికెరిగించి ఆయన భక్తవత్సలత గుర్తుచేసి ఇచ్చుటకు గొనితెమ్ము.**

అని చెప్పి కొన్ని రహస్యములు దెలిపెను. అగ్నిద్యోతనుడను నా భూసురుడు అతి వేగముగా ద్వారకా నగరమునకు బోయి కృష్ణుని ద్వారపాలకులకు తనరాక

నెరింగించి అనుమతి గైకొని లోని కరిగి శ్రీహరిని గాంచి **పెండ్లికొడుకువు కమ్ము** అని దీవించెను.

కృష్ణుడు ముసి ముసి నవ్వులు చిలకరించుచూ తనగద్దెపై నుంచి దిగివచ్చి విప్రుని సాదరముగా కూర్చుండబెట్టి దేవతలను చేసినట్లు అర్ఘ్య పాద్యముల నిచ్చి పూజించి షడ్రసోపేతంబైన మంచి భోజనము బెట్టించి, ఆదరముగా వాని వద్దకు జేరి మెల్లగా పాదములొత్తుచూ మృదువుగా నిట్లనెను.

**ఓ భూసురోత్తమా! ఆనందకారకమైన నీ బ్రాహ్మణ ధర్మము ఆదర్శప్రాయమైనది. పెద్దలు మెచ్చినది. ఉత్తమ బ్రాహ్మణుడు స్వల్పమైన ధనలబ్ధికైన సంతసించును. ధనము వచ్చినదని గర్వించడు. ధర్మము దప్పి ఎట్టి పరిస్థితులనైన సంచరించడు. వాని ధర్మమే వాని కోర్కెలు దీర్చును. సంతోషపడని వాడు ఇంద్రుడైనను నాశనము నొందును. తృప్తి కలిగినవాడు ధన హీనుడైనా ఇంద్రుని**



**సరివాడు కాగలడు. అందుచేత నేను సర్వప్రాణులకూ హితులై, దొరికిన దానితో సంతృప్తులై, శాంతచిత్తులై, సుజనులై, గర్వములేనివారైయుండు బ్రాహ్మణ శ్రేష్ఠులను గౌరవింతును. వారికి నమస్కరింతును.**

**ఓ బ్రాహ్మణోత్తమా! మీరే రాజుపాలనలో సేమము కలుగుచున్నది? ఏ రాజు పాలనలో ప్రజలు సుఖింతురో అట్టి రాజు నాకు ఆప్తుడు. సముద్ర మధ్యమున నున్న ఈ నా కోటకు మీరెట్లు రాగలిగిరి. తమరి చిరునవ్వుల నాపి, తమరి మనస్సులోని ఆలోచన వివరించండి చేయగలమేలు చేసెదను.**

లీలామానుష విగ్రహుండైన శ్రీకృష్ణపరమాత్మ యీ విధముగా నడుగగా ఆ భూసురోత్తముండిట్లనియెను. **దేవా! విదర్భ దేశమునకు రాజు భీష్మకుడు. ఆయనకొక కుమార్తె యున్నది ఆమెపేరు రుక్మిణి. ఆమె నీ సేవాదీక్షా పరురాలై వివాహమనెడి శుభముతో ముడిపడిన ఒక**



**సందేశము వినిపింపమని నన్ను ఆర్తితో ఇక్కడకు పంపినది. ఆ సందేశమును నీకిప్పుడు నేను వినిపింతును. శ్రద్ధగా నాలకించి నాలక్ష్యము నెరవేరునట్లు నన్ను అనుగ్రహింపుము. ఆ సందేశమేమన.....**

**సీ॥ వినినంత నీగుణ విభవంబు గోపాల!**
**తీరుతాపంబెల్ల దేహములకు**
**కనినంత నీ శుభాకారంబు గన్నులన్**
**చేజిక్కు లాభంబు సిరులు కలుగు**
**కొనినంత నీపాద వనరుహంబుల సేవ**
**సర్వోన్నతత్వంబు నుర్విగలుగు**
**అనినంత నీ నామ మమలంపు భక్తితో**
**సంసార బంధాలు సమసిపోవు**



**తే॥ నాదు చిత్తంబు నీయందు యొదిగియుండె**
**అన, నీపైన ఓ ప్రభూ! వినుతచరిత!**
**సిగ్గు విడిచెద నర్థింతు జేకొనంగ**
**మానినీ చిత్తచోరా! మహానుభావ!**

**(పోతనగారి 'ఏనీగుణముల కర్మేంద్రియముల... ఆధారంగా)**

తా॥ ఓ మహానుభావా! కృష్ణా! స్త్రీల హృదయములను దోచుకొనువాడా! నీగుణముల వైభవము వినినంత మాత్రముననే దేహంబులందున్న తాపములన్ని తీరిపోవును. శుభప్రదమైన నీరూపమును చూచినంత మాత్రమున పెక్కులాభములు, సంపదలు కలుగును. నీపాదపద్మముల సేవ జేసినంత మాత్రమున ప్రపంచమున గల సర్వులలో శ్రేష్ఠత్వము కలుగును. నీ నామము అనుపమానమైన భక్తితో పలికినంత మాత్రమున సంసార

బంధములన్నియు తొలగిపోవును. ఓ ప్రభూ! నామనస్సు నీయందు లగ్నమై ఉన్నది. వినుము. నీపైన ఒట్టు పెట్టుకుంటున్నాను. సిగ్గువిడచి నిన్ను వేడుకొంటున్నాను. నన్ను స్వీకరింపుము.

ఓ వాసుదేవా! ధన్యుడును, జనుల నాకర్షించు రూపము గలవాడును, ఉన్నతవంశ సంజాతుడును, అందము విద్యగల యౌవనవంతుడును, బలసంపదలు కలిగిన మంచివాడును, దానగుణము పరాక్రమము గల శరణాగత రక్షకుండును, దయాగుణము కలవాడును, అయిన నిన్ను ఏ కన్య వరించదు? రత్నాకరుడైన ఆ సాగరుని కూతురైన శ్రీ మహాలక్ష్మియే నిన్ను వరించినది కదా! నీమీద మోహము నాకు ఈనాడు పుట్టినదా? కాదు ఏనాడో పుట్టినది.

ఓ పురుషసింహమా! మంగళ స్వరూపా! శ్రీకృష్ణా! గుహలో ప్రవేశించి సింహమునకు చెందవలసిన సొత్తును



(ఆహారమును) నక్క కోరిన తీరుగా నీ పాదములయందే ధ్యాసగల నన్ను గర్వించిన ఆ చేది దేశాధిపతి శిశుపాలుడు వచ్చి నన్ను త్వరగా చేపట్టనున్నాడు. ఆ యధమాధముడు నీ శక్తి సామర్థ్యములను ప్రతాపమునూ యెరుంగడు.

నేను గతజన్మమునుండియే, లోకకళ్యాణ కారకుడైన శ్రీకృష్ణుడు నా భర్త గావలెనని కోరి వ్రతములు, దైవపూజలు, గురుపూజలు బ్రాహ్మణుల పండితుల సేవలు, దానధర్మములను చేసియున్నచో వసుదేవుని సుతుడైన ఆ శ్రీకృష్ణుడు నా భర్తయగు గాక! రణమున శిశుపాలాది నీచులు ఆయన చేతిలో పరాజితులవుదురు గాక!

చం॥ పలుకను అడ్డు చేకొనుము పంకజనాభ!
సురేంద్రవంద్య! నా
పిలుపుకు మన్ననిచ్చినను పెండిలియాడుము
రాక్షసంబుగా,



చులకన సేయబోకు పురుషోత్తమ! చైద్యుని
గెల్చి నన్నిదే
తెలుపుచు నీదు శౌర్యమును తేకువజేకొని
పొమ్మువచ్చెదన్

(పోతనగారి "అంకిలి సెప్పలేదు....." ఆధారంగా)

తా॥ దేవతలచే కీర్తింపబడు ఓ పద్మనాభా! నేను నీకు అభ్యంతరం చెప్పను. నన్ను తీసికొని పొమ్ము. నాయీ ఆహ్వానాన్ని మన్నించి నన్ను రాక్షస వివాహం చేసికొనమని వేడుకొంటున్నాను. ఓ పురుషోత్తమా! నన్ను చులకన జేయకుము. నీ ప్రతాపము చూపి, శిశుపాలుని ఓడించి ధైర్యంతో నన్ను తీసికొని పొమ్ము. తప్పక వచ్చెదను.

"నీవుండునది అంతఃపురములో. నిన్ను తెచ్చుటకు ఎట్లు వీలగును? ఒకవేళ నీవు వచ్చినను నీ కావలి వారిని



నీ బంధువులను సంహరింపవలసి వచ్చునేమో" అని నా గురించి సందేహింపకుము. కృష్ణా! నేనొక ఉపాయంబు చెప్పెదను వినుము. మావారు పెండ్లికూతురును చేసిన నన్ను మా కులదేవత పార్వతీదేవికి మ్రొక్కించుటకు నగరము వెలుపలనున్న కోవెలకు పంపుదురు. ఆ విధముగా నేను వచ్చినప్పుడు నీవు నన్ను హఠాత్తుగా నీవెంట తీసుకొని పొమ్ము.

ఓ ప్రాణేశ్వరా! మహాత్ములకైన అజ్ఞానాంధకారము తొలగిపోవుటకు, గౌరీనాథుడైన శంకరుడు నీపాదోద్భవమైన గంగను చేబట్టి గంగాధరుడైనాడు. నేడు నేను ఆపదయను ఘోరాంధకారమును ధరించి యుంటిని. నీ పాద పద్మముల మకరందంలో మునుగుటకు నేను వాంఛించు చున్నాను. అటువంటి మహాత్ముడవైన నీ దయకు పాత్రురాలిని గానిచో నా బ్రతుకు వ్యర్థము. ఇంకా నూరు జన్మల వరకైనా నిన్నే భర్తగా కోరుకొనుచున్నాను. దానికై

**ఎన్నైనా వ్రతములు, ఉపవాసములు చేసి ప్రాణ త్యాగం చేస్తాను. ఇది నిజము. అంతేకాని శిశుపాలుని వంటి అధమాధముని చేబట్టి నా జన్మ పాపపంకిలము చేసుకొనజాలను.**

**నా ప్రాణనాథా! మనసు పరవశింపజేసే నీమాటలు వినలేని చెవులెందుకు? నీవు అనుభవింపని ఈ నా దేహం, దాని సౌందర్యం ఎందుకు? లోకాలను సమ్మోహన పరచే నీ అందం చూడని ఈ నా కన్నులు వ్యర్థం కదా! అవెందుకు? నీ అధరామృతమును రుచి చూడని నాలుక ఎందుకు? నీవు దాల్చెడి వనమాలికల సువాసన నాఘ్రాణించని నా నాసిక ఎందుకు? నీకు సేవజేయలేని నా జన్మమెందుకు?"**

ఈ విధముగా రుక్మిణీదేవి పంపిన సందేశమును వినిపించి, ఆమె రూప సౌందర్య గుణాది విశేషములను వివరించి, **స్వామీ! ఇకపై చేయవలసిన దేదియో నీవే**



**ఆలోచింపుము** అని శ్రీకృష్ణుడు రుక్మిణియందు మోహమధికమై కార్యోన్ముఖుడగుటకు రుక్మిణి అంద చందములను వర్ణించుచూ ఇట్లనెను.

**శ్రీకృష్ణా! ఆమె అందచందముల నేమని వర్ణింతును? ఆమె పాదములు లేచిగురుటాకులు. తొడలు బంగారు అరటి బోదెలు. ఎట్టి కాంతితో మనోహరముగా నుండును అరచేతులు అతి సుకుమారములు. ఆమె కంఠము శంఖమువలె మిక్కిలి శుభప్రదమైనది. (మనోహరమైన ధ్వనితో నుండును). నడుము ఉన్నదా లేదా అన్నట్లుండును. స్తనయుగ్మము కన్నులకాహ్లాద కరములు. ఆమె నుదురు నెలవంకనే గేలిసేయు నట్లుండును. ఆమె జడ నల్లని తుమ్మెదల బారును గెలుచునట్లుండును. ఆమె చూపులు మదనుని తూపులు (బాణములు). కనుబొమ్మలు ఆ బాణాలను సంధించెడి వింటివలె నుండును. ఆమె మాటలు మనస్సునకానంద**



**దాయకములు. ఆమె ముఖము చంద్రబింబముతో మైత్రి జరుపునట్లు ప్రకాశించుచుండును.**

(బుద్ధిమంతులు ఎదుటివారు తమకేమి చెప్పెదరో పూర్తిగా విని, ఆపైన సమాధానము నిచ్చెదరు. అందుకే శ్రీకృష్ణుడు మౌనముగా వినుచున్నాడు. వరుడు, వధువుయొక్క అంగముల వర్ణనకు ఆకర్షితుడవుతాడనే పోతనగారు రుక్మిణి అంగముల నా విధముగా వర్ణించినారు)

**చం॥ తగుదువు నీవు ఆమెకిక తగ్గక ఆమెయు**
**నీకు సాటియౌ**
**సుగుణములన్ని తూగు మధుసూదన! నా**
**గురుపైన యాన, ఏ**
**తగవగు నోకదా! హితుల తప్పక తోడ్కొని**
**బొమ్ము శత్రులన్**
**తెగడుము బాలికన్ వలపు దీరగ జేకొని**
**రమ్ము మేలగున్.**



**(పోతనగారి "ఆ ఎలనాగ నీకుదగు...." ఆధారంగా)**

తా॥ ఓ మధుసూదనా! నీవు ఆ రుక్మిణీదేవికి తగిన వరుడవు. ఆమెకూడ నీకు తగిన భార్య. నా గురువుగారిపై ఒట్టుపెట్టుకొని చెబుతున్నాను. మీ ఇద్దరి సుగుణములు కూడ సమంగా ఉన్నాయి. అక్కడ నీవు రాగానే ఏమి యుద్ధం జరుగుతుందో తెలియదు కదా! కనుక నీవారిని కొంతమందిని నీ వెంట తీసికొని పొమ్ము. నీ శత్రువులను చీల్చి చెండాడి ఆ కన్యను ప్రేమతో తీసికొనిరా. నీకు శుభం కలుగుతుంది.

అని ఆ భూసురుడిట్లు పలుకగా, విదర్భ రాజనందన పంపించిన సందేశమును, రూప సౌందర్య విశేష వివరములను ఆలించి, మనసుకు పట్టించుకొని తన చేతితో ఆ బ్రాహ్మణ రాయబారి చేయిపట్టుకొని దేవకీనందనుడిట్లనెను.

**పండిత నుతుడవైన ఓ విప్రోత్తమా! ఆ రుక్మిణీదేవిపై నా వలపు తలంపు చాలా దృఢమైనది. రాత్రులందు నాకు నిద్దుర బట్టుటలేదు. రుక్మి ఆమెకు నాతో వివాహమున కంగీకరింపక ఎల్లప్పుడూ మా పెండ్లి చెడగొట్టుటకే యత్నించును. అది నాకెన్నడో తెలియును. ఆరణిని మథించి అగ్నిని పొందినట్లు నా శత్రువులను సంహరించి రుక్మిణిని తీసికొని వచ్చెదను.**

(అగ్నిని పుట్టించుటకు, రావి కట్టను జమ్మి కట్టను బలంగా రాపాడించెదరు. ఆ సాధనమును ఆరణి అందురు)

**ఆ॥ మీ విదర్భకొచ్చి మీ రాచకన్నియన్,**
**బేల గొంచుపోదు లీల జూపి**
**రిపులు అడ్డమైన లిప్తలో యోడింతు**
**భయము వలదు నమ్ము, బాస జేతు.**

(పోతనగారి "వచ్చెద విదర్భ భూమికి...." ఆధారంగా)



తా॥ నేను మీ విదర్భ దేశమునకు వచ్చి, అమాయకురాలైన మీ రాకుమారిని అవలీలగా వెంటబెట్టుకొని తీసుకుపోతాను. శత్రువులు అడ్డగిస్తే రెప్పపాటులో వారిని ఓడించెదను. నన్ను నమ్ముము. మాట ఇస్తున్నాను. భయపడకుము.

అనిచెప్పి రుక్మిణీదేవి పెండ్లి నక్షత్రంబేదో తెలిసికొని శ్రీకృష్ణుడు తన రథ సారథియైన దారుకునిచేత శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలహాకములను అశ్వములను పూన్చిన రథము నాయత్తము జేయించి, అందు తానును బ్రాహ్మణుండును గూర్చొని ఒక్క రాత్రముననే నర్తక దేశములనన్నింటినీ దాటి హుటాహుటిగా విదర్భ జేరెను.

అక్కడ కుండిన పురాధీశుడైన భీష్మకుడు పెద్ద కొడుకు రుక్మికిత్తుమాట కెదురాడలేక తన పుత్రికను శిశుపాలుని కిత్తునని శుభకార్య ప్రయత్నములు చేయుచుండెను. ఆ సమయమున...



కుండిన నగరంలో నాలుగు బాటల కూడళ్ళు, రాజమార్గములు, సందులు, అంగళ్ళు అన్నియు విస్తరింపజేశారు. నీళ్ళతో మంచి గంధం కలిపి కళ్ళాపి చల్లారు. కలువపూల మాలలతో అనేకమైన తోరణములు కట్టారు. గృహములన్నీ అలంకరించారు. కర్పూరముతోను, కుంకుమతోను ముగ్గులు పెట్టారు. అగరు ధూపములు వేశారు. నగరంలోని స్త్రీ, పురుషులందరు రంగు రంగుల వస్త్రములను ధరించారు. పూలదండలు ఆభరణాలను వేసుకున్నారు. గంధపు మైపూతలు పూసుకున్నారు. మంగళవాయిద్యములు మ్రోగినవి. నగరానికే పెళ్ళి కళ వచ్చేసింది.

అంతనా భీష్మకుండు శాస్త్ర ప్రకారము నాందీ శ్రాద్ధము చేసి పితృదేవతల నారాధించాడు. బ్రాహ్మణులకు విందు భోజనం పెట్టించి శుభాశీస్సులు చదివింపజేశాడు. మంగళస్నానములను రుక్మిణీదేవికి ముత్తైదువులు చేయించారు. పట్టుచీరె, ఉత్తరీయమును కట్టారు.



అలంకరణ చేశారు. బ్రాహ్మణులు భూతప్రేతాదుల బాధ కలుగకుండా రక్షాకరణములను చేశారు. వేదపండితులు నాలుగు వేదములను చదివారు. పురోహితులు నవగ్రహ శాంతికోసం హోమము చేశారు. నూతన దంపతుల క్షేమం కొరకు రాజు నువ్వులను, గోవులను, వెండి బంగారములను, వస్త్రములు మున్నగునవెన్నో దానం చేశాడు. బ్రాహ్మణులంతా దానములనుగ్రహించి తమ ఆశీస్సులనంద చేశారు.

శిశుపాలుడు చాలమంది భటులతోను, మదపుటేనుగులతోను, వడిగా పోగల అశ్వములతోను, బంధుమిత్రులతోను, కలిసి రుక్మిణిని పరిణయ మాడుటకు స్వేచ్ఛాప్రవృత్తిగలవాడై గర్వించి ఆడంబరముగా కుండిన పురమునకు తరలి వచ్చెను.

ఆ శిశుపాలుడు పలువురు బంధువులతో కలిసి బలరామకృష్ణులు వచ్చినచో సాహసముతో వారి నెదుర్కొని

పారద్రోలి శిశుపాలునికి రుక్మిణితో పెండ్లి జేయుటలో కలుగు అవాంతరములు తొలగి శుభకార్యము నిర్విఘ్నముగా జరిపించెదమని అతని మిత్రులైన జరాసంధుడు, దంతవక్త్రుడు, సాల్వుడు, విదూరథుడు, పౌండ్రకుడు మొదలైన పలువురు రాజులు చతురంగ బలములతో కుండిన నగరమునకు తరలి వచ్చిరి.

ఇదియునుగాక చాలదేశముల నుండి పలువురు రాజులు విచ్చేసిరి. భీష్మకుడు వరునిగా వచ్చిన శిశుపాలుని కెదురు వెళ్ళి స్వాగతించి, సత్కరించి తీసికొని వచ్చి ప్రత్యేకమైన విడిదిలో ప్రవేశ పెట్టెను. అప్పుడీ వృత్తాంత మంతయు విని....



**ఉ॥ బాలను గాంచు బోదునని వచ్చెను కృష్ణుడు**
**తాను ఒంటరై**
**మేలొనరించ చైద్యునికి మిత్రులు సాల్వుని**
**వంటి వారలున్**
**ఆలము సేయ వత్తురని ఆ హలధారియు**
**వాని సేనతో**
**వీలుగ వచ్చి జేరె తను వెన్నుని కావగ**
**తోడు నీడయై**

(పోతనగారి “హరియొకడేగినాడు....” ఆధారంగా)

తా॥ రుక్మిణీదేవిని తన వెంట తీసుకు పోయెదనని శ్రీకృష్ణుడు ఒంటరిగా విదర్భకొచ్చాడు. ఇక ఆ దుర్మతి శిశుపాలునికి సహాయం చేస్తామని సాల్వుడు వంటి రాజులు సైన్యంతో వచ్చారు. ఈ విధంగా ఆలోచించి బలరాముడు తను కూడా యాదవ



సైన్యంతో కృష్ణునికి సహాయంగా వచ్చి సిద్ధమయ్యాడు.

ఇక్కడిదిలా ఉండగా అక్కడ రుక్మిణీదేవి అన్నిటినీ చూచిన వానివలె గ్రహించగలిగిన ఆ శ్రీకృష్ణుడు తనను దయజూపి చేరవచ్చుటకు ఎందుకు నిర్ణయింపడా అని శంక కలిగినదై....

శుభలగ్నం రేపే అని నిర్ణయింపబడినది! వివాహ ముహూర్తం దగ్గిర బడింది. శ్రీకృష్ణుడు ఇంకనూ రాడేల? మనస్సు ఆందోళన చెందుచున్నది. అసలు శ్రీకృష్ణుడు నా కథ విన్నాడా! వెళ్ళిన అగ్నిద్యోతనుడు ఇంత జాగేల చేయుచున్నాడు? నాయీ ప్రయత్నములు ఫలించునో ఫలించవో! బ్రహ్మ నానుదుట ఏగీత వ్రాసినాడో తెలియకున్నది గదా!



**చం॥ విమలుడు భూసురుండరిగి వెన్నుని జూచెనొ**
**దారిదప్పెనో**
**సమయము దాటెనో హరికి సందియమై విని**
**ఊరకుండెనో**
**అమరుచు వచ్చెనో! హరుడు ఆదుకొనన్ నను**
**సమ్మతించడో**
**కమలభవుండు మాకు జతగట్టక అద్రిజ**
**బ్రోవబూనదో!**

(పోతనగారి జగద్విఖ్యాతమైన
“ఘనుడా భూసురుడేగెనో....” ఆధారంగా)

తా॥ నిర్మలమైన హృదయంగల బ్రాహ్మణుడు అగ్నిద్యోతనడు వెళ్ళి శ్రీకృష్ణుని చూచినాడా? లేక దారితప్పి వెళ్ళలేక పోయినాడా? ఒకవేళ సమయం మించి పోయిందా? శ్రీకృష్ణునికి నా ప్రేమ మీద అనుమానం కలిగి విని ఊరకున్నాడా? లేక ఏర్పాట్లు

అన్నీ చేసుకొని వచ్చాడా? ఆ పరమశివుడు నాకు సహాయ నిరాకరణ చేయుచున్నాడా? అసలు ఆ బ్రహ్మదేవుడు మాకిద్దరికీ ముడి వేయనందు వలన ఆ పార్వతీదేవి నాకెందుకు లెమ్మని నన్ను రక్షించదేమో!

అని అనేక విధములైన సందేహములతో కలత జెందుచుండెను.

బ్రాహ్మణుడు ద్వారకా నగరము జేరియుండడు. ఇక ఆ వాసుదేవుడు రాడు. పోనీ ఇంకెవరినైనా పంపుదామంటే నా మొర వినే ఆప్త బంధువు మాత్రం ఎవడున్నాడు? నా స్వంత అన్న రుక్మికే న్యాయమూ ధర్మము లేనప్పుడు అతని కెవ్వరు అడ్డు చెప్తారు? ఆ శిశుపాలునికి నన్ను కట్టబెట్టాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. జగదీశ్వరియైన ఆ పార్వతీదేవికి నాపైదయ తప్పింది''. ఆ విధముగా ఆ బేల తలపోయుచుండెను.



ఆ రుక్మిణీదేవి తన తల్లికి గూడ తన మనసులోని మాట జెప్పదాయెను. వెన్నెలవంటి తన చిరునవ్వుతో దిశలను నింపదాయెను. తన ముఖమును పద్మమని భ్రమపడి ముసిరిన తుమ్మెదలను వెడలగొట్టదాయెను. తన ఉరోజములపై చిక్కువడ్డ బంగరు ఆభరణములనైనను విడదీయదు. కృష్ణుడు వచ్చు మార్గమునే తిలకించుచూ క్షణమైనా దృష్టి మరల్చనిదాయెను.

ఆమె, కన్నులనుండి ధారగా కారుచున్న కన్నీటిని తుడుచుకోదు. చెదరిన కేశములను సరిజేసుకొనదు. ప్రియ సఖియలను పిలిచి వారితో ముచ్చటించదు. అన్నమును తినుటలేదు. నీరు త్రాగదు. ప్రేమతో పెంచిన చిలుకలకు పద్యము నేర్పదు. వీణియను మ్రోగించి వినోదము నొందదు. ఇతరులతో గలియక ఒంటరిగా నుండును.



**సీ।। అద్దమంటి మొకము నద్దాన జూడదు**
**విరులను సిగలోన దురుమబోదు**
**అంచనడక 'చాన' హంసంబు పెంపదు**
**పన్నీటి జలకంబువంక బోదు**
**వనములనాడదు వనజాతదళ నేత్రి**
**కస్తూరినలమదు కలికి మేన**
**నగల ధరింపదు, నగవుల జూపదు**
**లతల బోషింపదు లలితగమన**

**తే।। నుదుట తిలకంబు దిద్దదు సుదతి బూని**
**పద్మగృహమున జేరదు పద్మగంధి**
**కరుణ తననేల గొనిపోదు హరియనంచు**
**బాల కళవెళపడెనట్లు కలతజెంది.**

(పోతనగారి "మృగనాభియలదదు మృగరాజ మధ్యమ ఆధారంగా)



తా।। ఆ రుక్మిణీదేవి, అద్దమువలె మెఱిసిపోవు తన ముఖమును అద్దమున చూచుకొనుటలేదు. తన తలలో పూవులను ధరించుట లేదు. హంసవలె నడచు ఆమె హంసలను పెంచుటలేదు. పన్నీటి స్నానములు చేయుటలేదు. పద్మముల రేకులవంటి కన్నులుగల ఆమె తోటలలో ఆడుకొనుటలేదు. శరీరమున కస్తూరిని దాల్చుటలేదు. నగలు ధరించుటలేదు. నవ్వును కూడ మరచిపోయింది. అందముగా నడచు ఆమె పూలతీగెలకు నీళ్ళుకూడా పోయుటలేదు. ఆమె తన నుదుట తిలకం దిద్దుకొనుటలేదు. పద్మముల సువాసన గల ఆమె పద్మములతో అలంకరించిన మందిరమునకు వెళ్ళటం లేదు. శ్రీకృష్ణుడు కరుణించి తనను రక్షించదేలనో అని ఆమె కంగారుపడి వేదన అనుభవించింది.

మఱియును.....

ఆ రుక్మిణీదేవి మన్మధుని వలన కలిగిన తాపముతో చల్లని గాలిని భరించలేక వెనుదిరుగుచుండెను. తుమ్మెదల ఝుంకారమునకే భీతిల్లి పారిపోవుచుండెను. కోయిల కూతను కూడ భరించలేకుండెను. చిలుకల పలుకులకే కలవరపడుచుండెను. వెన్నెల వేడిమిని కూడ భరించ లేకుండెను. తీపి మామిడి చెట్టు నీడను కూడ భరింపలేక దూరముగా తొలగిపోవుచుండెను.

ఈ విధముగా కృష్ణుని రాక కెదురు తెన్నులు చూచుచు అన్ని కార్యములందునూ నిరాసక్తయై యుండెను. మన్మధతాపమును భరింపలేకుండెను. ఆ రుక్మిణీదేవి ఎడమ భుజము, కన్ను, తొడ అదిరినవి. అంతలో కృష్ణుని మాటపై అగ్నిద్యోతనుడచటకు జేరెను. రుక్మిణి అతని ముఖ కవళికలను గమనించి చిరునవ్వులు చిందించుచూ ఆయనకెదురై నిలిచి యుండెను. అంత ఆ భూసురుండిట్లనియెను.



**ఓ కన్యారత్నమా! ఆ శ్రీకృష్ణుడు నీ సద్గుణములనెంతో మెచ్చాడు. నాకు పెక్కు ధనకానుకల నిచ్చాడు. ఆయనే స్వయముగా వచ్చియున్నాడు. దేవతలు కాని రాక్షసులు కాని అడ్డుపడి ఆతనిని వారించలేరు. యుద్ధమున వారినైనా జయించి నిన్ను రాక్షస వివాహమున నిన్ను తనవెంట ఎత్తుకొని పోవుటకు నిశ్చయించినాడు. నీ అదృష్టము పండినది. నీ సచ్చరిత్రము ప్రసిద్ధమగును గాక!**

బ్రాహ్మణుడిట్లనగా విదర్భ రాకుమారి ఇట్లు చెప్పెను.

**చం॥ వనరుహ లోచనున్ కలిసి ప్రాణము నిల్పితివయ్య! నిన్ననే**
**ననుపమ భక్తి గొల్చెదను అంజలినిన్ ఘటియింతు భూసురా!**
**గొనకొని ఏమి చేయుదును కూరిమి ప్రత్యుపకార మింక, నా**
**మనసున వంత బాపితివి మాధవు నాథవు జేయ బూనుచున్**



(పోతనగారి జగత్ప్రసిద్ధమైన "జలజాతేక్షణు దోడి తెచ్చితివి...." ఆధారంగా)

తా॥ ఓ భూసురోత్తమా! కమలనయనుడైన ఆ శ్రీకృష్ణుని కలిసికొని నా ప్రాణములు పోకుండా కాపాడినావు. నేను నిన్ను అసమానమైన భక్తితో పూజించెదను. చేతులు జోడించి నీకు నమస్కరింతును. ఇంక అంతకంటే నీకు మరేమీ ప్రత్యుపకారం చేయలేని అశక్తురాలిని. ఎంత మహోపకారం చేశావు నాకు? నా మనస్సులోని దిగులు అంతా తొలగిపోయింది. మాధవుణ్ణి నా భర్తని చేస్తున్నందుకు కృతజ్ఞురాలిని.

అని పలుకుచు ఆ బ్రాహ్మణునకు వందన మాచరించెను. అంత బలరామకృష్ణులు తన కుమార్తె పెండ్లికి వచ్చిరని విని భీష్మకుడు పరమానందముతో వారికెదురేగి వస్త్రాభరణములతో సత్కరించి తగు విడిది



నేర్పాటు చేసి వారు సేనలతో వచ్చినందున వారి సేనలకునూ తగు వసతులు గల్పించెను. తక్కిన రాజులకు కూడ వారి వారి విభవమునకు తగ్గట్లు విడిది మొదలైన మర్యాదలు చేసెను. వారికి వలసిన వస్తువుల నేర్పాటు చేసెను. అప్పుడు కుండిన నగర ప్రజలందరును కంసాది దానవ వైరి వచ్చెనని వారిని జూచి తమ కన్నులపంట పండించుకొనిరి. శ్రీకృష్ణుని జూచి వారిట్లనుకొనిరి....

ఆహా! ఈ శ్రీకృష్ణుడే మా రాకుమారికి తగిన భర్త. రుక్మిణీదేవి కూడ అన్ని విధములా ఈతని సరిజోడి. వీరి దాంపత్య మెంత సొగసుగా నుండునో! వీరిద్దరికీ ముడిపెట్టిన ఆ విదాత ఎంత చతురుడో గదా! మా పుణ్యమంతా వీరికి కలిగి ఆ శ్రీకృష్ణుడు మా రుక్మిణికి భర్తయగును గాక!

అని పలికిరి. అంత....

ముందు వెనుకల వీరభటులు వివిధాయుధములను ధరించి వచ్చుచుండగా, మధుర పదార్థములను కానుకలను గైకొని వారవనితలు మెల్లగా వచ్చుచుండగా; ఆ వెనుక పూలు, నగలు పట్టుబట్టలు ధరించి బ్రాహ్మణ స్త్రీలు నడచుచుండగా, బాకాలు, డోళ్ళు, మద్దెళ్ళు, భేరీలు మొదలైన వాయిద్యముల ధ్వనులు మిన్ను మిట్టుచుండగా; చెలికత్తెలు, పెద్ద పిన్నతల్లులు బంధువుల భార్యలూ వెంటరాగా రుక్మిణి కోట వెలుపలికి గౌరీపూజకై బయలుదేరెను.

గాయకులు, వందిమాగధులు, సూతులు, స్తోత్ర పాఠకులు వెంటవచ్చుచుండగా; మనసులో శ్రీకృష్ణుని పాదపద్మములను ధ్యానించుచూ రుక్మిణీదేవి పార్వతీదేవి ఆలయమునకు జేరి కాలుసేతులు కడుగుకొని గౌరీదేవి విగ్రహమును సమీపించెను. ముత్తైదువులు అయిన బ్రాహ్మణ స్త్రీలు దగ్గరయుండి ఆ పార్వతీ దేవికి అర్ఘ్య



పాద్యములిచ్చి, వస్త్ర, భూషణములు, గంధ పుష్ప మాల్యాదుల చేత అలంకరించి, ధూప, దీపము లిప్పించి, అనేకములైన పదార్థమ్ములను నివేదన చేసి, దీపములతో నీరాజనములతో మంత్రపుష్పము సమర్పించి ఆ రుక్మిణీ దేవితో జగన్మాత గౌరీదేవికి మ్రొక్కించిరి.

**చం॥ నిలిపితి నాది దంపతుల నీలిమకంఠుని శైల నందనన్**
**గొలిచి మనంబునన్ ప్రియము గూర్చగ నే భజియింతు శాంభవీ!**
**చెలువము జూపి శ్రీహరిని సేయుము నాపతి ఓ దయామయీ!**
**కలుగదు కీడుయెన్నటికి కావగ మిమ్ముల నార్తి వేడినన్**

(పోతనగారి "నమ్మితి నా మనంబున...." ఆధారంగా)



తా॥ ఓ పార్వతీదేవీ! ఆది దంపతులై పార్వతీ పరమేశ్వరులైన మిమ్ములను నా మనస్సులో నిలిపి పూజించెదను. నాకు మేలు చేయుటకై సదా ధ్యానించెదను. నాపై ప్రేమజూపి శ్రీకృష్ణుని నా భర్తను గావింపుము. ఆర్తితో మిమ్ములను శరణు వేడిన వారికి ఎన్నటికీ అపకారం జరుగదు.

అని ఆ వైదర్భి పార్వతీదేవికి మ్రొక్కి బ్రాహ్మణ దంపతులకు ఉప్పువేసిన అప్పములను, తాంబూలములు, మంగళసూత్రములు, ఫలములు, చెరకు ముక్కలు ఇచ్చి భక్తితో పూజించెను.

ఆమె పూజలకు సంతోషించిన బ్రాహ్మణ దంపతులు ఆమెను దీవించి తలపై అక్షింతలు చల్లిరి. అక్షతలు శిరస్సున దాల్చిన ఆ రుక్మిణి మరియొక సారి భవానికి మ్రొక్కి అంతవరకు పాటించిన మౌనవ్రతమును విడనాడెను. ఆపై గుడినుండి వెలుపలికి వచ్చెను.



ఈ ప్రకారముగా మేఘముల మధ్య మెఱయు మెఱుపు తీగవలెను, చంద్రబింబము నుండి వెలువడి వచ్చిన లేడి వలెను, బ్రహ్మాయను నాట్యగాడు తెరతొలగించిన వెలువడు మోహినీదేవి వలెను, వాసుకిని త్రాటివలె దేవదానవులు పాలసముద్రమును, మంధర పర్వతముతో చిలికినపుడు వెలువడిన లక్ష్మీదేవి వలెను, ఆ రుక్మిణీదేవి పార్వతీదేవి ఆలయమునుండి వెలువడినది.

మానస సరోవరమందలి పద్మంబుల మధ్య విహరించు రాయంచ వలెను, కుచ భార కంపిత నడుము గలదై ఒకచేయి పట్టి మెల్లగా చెలికత్తె నడిపించుచుండగా, బంగారు చెవికమ్మల మెఱుపులు లేతబుగ్గలపై ప్రసరించుచుండగా, ఆమె ముఖము పద్మమని భ్రమపడి తుమ్మెదలు ముసిరినవా అన్నట్లున్న ఉంగరాల ముంగురులు మొగముపై నర్తించుచుండ, చిరునవ్వుల కాంతులు లేత వెన్నెలల వలె వ్యాపించు చుండగా, పలు

వరుసపై ఎఱ్ఱగా దొండపండు వంటి క్రింది పెదవి రంగు అలుము కొనియుండగా, వల్లెవాటు మన్మధుని జెండావలె రెపరెపలాడుచుండగా, మణి ఖచిత వడ్డాణము ఏడురంగుల ఇంద్రధనస్సు వలె మెఱయు కాంతులు విరజిమ్ముచుండగా, అనంగుని తూపులవలెనున్న చూపులు రాజుల హృదయంబులను చీల్చుచుండగా, వినసొంపుగా కాలి అందియల మ్రోతలు వినబడుచుండగా, అచ్చటి వీరులను సవ్యామోహింప చేయుచున్నదై ఆ విదర్భరాజనందన శ్రీకృష్ణుని రాక కెదురు చూచుచు ముందుకు నడుచుచున్న సమయంబున...

తుమ్మెదలవంటి ముంగురులు, నిండు చంద్రబింబము వంటి ముఖము, లేడికన్నుల వంటి కన్నులు, పగడము వంటి అధరము, మధురమైన కంఠస్వరము, లేచిగుళ్ళవంటి పాదములు, మదగజ కుంభస్థలమువంటి చనుదోయి, ఇసుక తిన్నెలవంటి



పిరుదులు, గజరాజ గమనము, ఎఱ్ఱతామరలవంటి అరచేతులు, కలువపూల వంటి మైసువాసన, సింహము నడుమువంటి నడుముగల ఆ రుక్మిణీదేవిని చూచి అందరూ ఆమె సౌందర్యమునకు ఆశ్చర్యపడుచుండిరి.

మఱియూ ఆ విదర్భరాకుమారి యొక్క చిరునవ్వు, సిగ్గులు చిందించు చూపులతో ఆ రాజుల మనస్సులు పట్టుతప్పి, ధైర్యములు దిగవిడచి, రాచఠీవి దారితప్పి, తమ ఔన్నత్యమూ పదవులూ మఱచి, చేష్టలుడిగి, తము నవ్వులపాలగదుమేవో అను జ్ఞానమే శూన్యమై, ఆయుధములను సైతము జాఱవిడిచి, ఏనుగులు గుఱ్ఱములు, రధములు వంటి తమ వాహనముల నెక్కుటయూ మఱచి ఒళ్ళు తెలియని మైకంలో నేలపై గూడ బడుచూ సొక్కుచుండిరి. సుకుమారియైన ఆ రుక్మిణీదేవి అందమైన చేతి గోళ్ళతో ముంగురులు ప్రక్కకు ద్రోలుకొనుచూ, పైట చక్కబెట్టుకొనుచూ కడగంటి



చూపులతో వరుసగా ఆ రాజులను చూస్తూ ముందుకు సాగి...

**చం॥ కనియెను రుక్మిణీ రమణి కంజదళాక్షుని**
**కంబు కంఠునిన్,**
**ఘనజలదంపువర్ణు, పెనుకాంతులు జిమ్మెడి**
**రత్నభూషణున్,**
**తనువున పీత వస్త్రములు దాల్చిన మోహను,**
**చంద్రసన్నిభున్**
**అనుపమ దీర్ఘబాహు, హరి నంగజు మించిన**
**ఆ జగత్పతిన్.**

(పోతనగారి జగద్విఖ్యాతమైన "కనియెన్ రుక్మిణి చంద్రమండల........" ఆధారంగా)

తా॥ పద్మదళ నేత్రుడును, శంఖము వంటి మెడ గలిగినవాడును, నీలమేఘము వంటి శరీరకాంతి గలవాడును, గొప్ప కాంతులు వెదజిమ్ము రత్నాభరణ



భూషితుడును, శరీరమున పీతాంబరములు ధరించిన మోహన రూపుడును, చంద్రుని వంటి కాంతిగలవాడును, పొడవైన చేతులు గలవాడును, మన్మధుని మించిన జగన్నాధుడైన ఆ శ్రీకృష్ణుని రుక్మిణీదేవి చూచినది.

చూచి అతని రూపము, యవ్వనము, దేహకాంతి, వైభవము, ఠీవి, నైపుణ్యమూ, వీరత్వము, మొదలగు గుణములకు సంతోషించి, మోహ పరవశయై ఆతని రధమునెక్క వలెనని కోరుచుండెను. అట్టి స్థితియందున్న ఆ రుక్మిణీదేవిని జూచి కృష్ణుడు రధము దిగి, రాజులందరూ చూచుచుండగా నక్కల మధ్య నున్న తన ఆహారమును సింహము తీసికొనుపోవు చందమున తన రధముపై నెక్కించుకొని గట్టిగా పాంచజన్య శంఖంబును పూరించుచూ బలరామాదులు వెంట వచ్చుచుండగా యాదవ సేనతో గూడినవాడై ద్వారకా నగరమార్గంబును

బట్టెను. అప్పుడు జరాసంధుని పక్షమువారైన రాజులందరూ కృష్ణుని పరాక్రమమును సైపలేక...

ఘనములైన సింహములకు దక్కవలసిన కీర్తిని అల్పమైన జంతువులు అపహరించినట్లు మన కీర్తులు అన్నియునూ అడుగునకు త్రొక్కి యీ గోపాలకులు మన రాచకన్నియ నెత్తుకొని పోవుచున్నారు. మీ శౌర్యప్రతాపము లిప్పుడు చూపింపక ఎప్పుడు చూపుతారు? అందాకా దాచుకొంటారా? గోపాలురనెదిరించలేని మీ శస్త్రాస్త్ర కౌశలం దేనికి? తగులబెట్టుకోవటానికా? రుక్మిణిని విడిపింపలేక పోతే ప్రజలంతా చాటుగానైనా మనలను చూచి నవ్వుకోరా?

అని వారు పరస్పరమూ హెచ్చరించుకొనుచు మనస్సులను రోషములతో నింపుకొని త్వరగా కవచములు ధరించి ధనస్సు మొదలైన ఆయుధములను ధరించి తమతమ చతురంగ బలములతో కదలి జరాసంధుడు



మొదలైనవారు యాదవ వీరులను వెంటాడి నిలవండి అని అరచుచూ పర్వతములపై మేఘములు జలధారలు కురిపించునట్లు బాణముల ప్రయోగించుచూ తరుము కొని రాగా యదుసేనలోని సేనాపతులు కూడా ధనుస్సు లెక్కుబెట్టి నిలువబడిరి. అంత....

శత్రుసేనలు విడిచిన బాణములలో యాదవ సేన మునిగిపోగా ఆ రుక్మిణి భయపడి సిగ్గుపడుచునే శ్రీకృష్ణుని మోమును వీక్షించెను.

ఇట్లు చూచిన,

**ఓ రుక్మిణీ! భయపడకుము. చూచుచుండుము. అదిగో యదుసేన శత్రుసైన్యమును చీల్చి చెండాడుచున్నది. గమనించుము. ఇంక శత్రువులు గాయపడెదరు. చెల్లాచెదరై పారిపోయెదరు. లేదా ఇంకనూ పోరి మరణింతురు.**



అని రుక్మిణి నోదార్చెను. అంత బలరాముడు మొదలైన యదువీరులు ప్రళయంబున పిడుగులు కురిపించు మహామేఘముల రీతి జరాసంధాది శత్రువులపై పెక్కు ఆయుధములతో విరుచుకు పడిరి. దానివలన శత్రుసేనలోని గజములు చనిపోయెను, అశ్వములు కూలెను, రధములు విరిగెను, కవచములు ఛేదింపబడెను. పదసేన నశించెను. గుఱ్ఱములపైన రౌతులు, గజముల పైన మావటి వాండ్రు, రధికులు చచ్చిరి. సైనికుల రొమ్ములు, నడుములు, ముక్కు చెవులు, కంఠములు ముక్కలయ్యెను. బుఱ్ఱలు పగిలిపోయెను. తలవెంట్రుకలు చెదరి విరజిమ్మబడెను. కాళ్ళూ మోకాళ్ళూ పిక్కలూ తెగిపడెను. సైనికుల పండ్లు రాలిపడెను. వీరుల ఆభరణములు నేలపాలాయెను. కుండలములు కిరీటములు మట్టిగరిచెను. వీరుల పెడబొబ్బలు మాత్రము వినబడుచుండెను. శూల ఖడ్గ గదాది ఆయుధంబులు



విరిగి విసిరి వేయబడెను. జండాలు ఛత్రములు చామరములు నేలరాలెను. కవచములు చినిగిపోయెను. గుఱ్ఱపు డెక్కలు చెలరేగించిన ధూళి నలుదిక్కులా వ్యాపించెను. రధములు వేగము గోల్పోయెను. వందిమాగధుల స్తోత్రములు అడుగంటెను. గుఱ్ఱముల సకిలింపులు, భేరీల భాంగార ధ్వనులు, గజముల ఘీంకారములు, రధచక్రముల పటపట ధ్వనులు, గుఱ్ఱముల నాభిప్రాంతమున గట్టు గంటల గణగణ ధ్వనులూ, వీరుల నగల జణజణలు, డప్పుల ధణ ధణలు, కాళ్ళ కడియాల కిణకిణలు, వింటినారుల టంకారములు, పరస్పరమూ ధిక్కరించుకొను వీరుల ధిక్కారములతో గూడిన మాటల ధ్వనులూ క్రమముగా అంతరించిపోయెను.

పారిపోవుచున్న జరాసంధుడు మొదలైన రాజులు ఒకచోట అంతా కలుసుకొన్నారు. భార్య పోయిన వాని వలె విచారించుచూ అలసట మొగమున కనబడుచున్న

శిశుపాలుడు తమముందు రోదించుచుండగా వానిని జూచి ఓ **చైద్యా! శత్రువుల చేతిలో జిక్కి చావక బ్రతికి వచ్చినందుకు ప్రాణములు దక్కినందుకు సంతోషింపక ఏడ్చెదవేల? అని పరామర్శించుచూ ఇట్లనిరి.**

**కం॥ బ్రతుకున్న భార్య దొరకును**
**బ్రతుకంగా వచ్చు దినుచు 'బలుసాకైనన్'**
**బ్రతకొచ్చు ప్రాణముండిన**
**సతిమాటా? దేవుడెరుగు చైద్యా! వినుమా.**

(పోతనగారి "బ్రతుక వచ్చునొడల ప్రాణంబులున్నచో..." ఆధారంగా)

తా॥ చైద్య దేశాధిపతియైన ఓ శిశుపాలా! బ్రతికుంటే భార్య దొరుకుతుంది. బలుసాకు వంటి ఆకులు తినియైనా బ్రతికుండవచ్చు. ప్రాణాలు దక్కితే చాలు బ్రతికి ఉండవచ్చు. ఇక పెళ్ళాం సంగతంటావా? ఆ మాట దేవుడెరుగు నా మాట విను.



**ఈ దేహమును ధరించిన జీవుడు అస్వతంత్రుడు. బొమ్మలాడించువాని చేతిలోని మరబొమ్మలమై మన మందరము ఆ భగవంతుని మాయకు లోబడియే సుఖ దుఃఖములను పొందుచున్నాము. తొల్లి నేను పదియేడు మార్లు మధురానగరముపై దండెత్తి బలరామకృష్ణులచే ఓడి నా సేనలన్నీ నశించి బలరామునిచే బంధింపబడి కృష్ణుని దయచే బ్రతికితిని. నేను మరల పదినెనిమిదవ సారి యిరువది మూడు అక్షౌహిణుల సైన్యంతో దండయాత్ర చేసి శత్రువులను పాఱద్రోలి విజయుడనయ్యాను. నేను జయము కలిగిన పొంగలేదు, అపజయమునకు క్రుంగలేదు. ఈనాడు కృష్ణునిదే పైచేయి అని విధాత నిర్ణయించి యుండిన వానినెదురించుట ఆ ఫాలాక్షునికైన సాధ్యము కాదు. నేటి ఆ కృష్ణుని ఉత్సాహము, మంత్రమూ సైన్యబలం అటువంటివి. ఇంతేకాక, దైవ నిర్ణయమైన కాల ప్రభావముచేత లోకములన్నియు దానికి వశములై తిరుగాడుచుండును.**



**అదీగాక....**

**ఈ యాదవుల కాలము మంచిగా వుండుట చేత విఖ్యాతి నొందిన పరాక్రమవంతులమైన మనలను నేడు కృష్ణుని యండతో గెలిచారు. కాలం రేపు మన పక్షమున ఉంటుంది. అప్పుడు అవకాశము చూచి పగదీర్చుకోవచ్చును. శత్రు సంహారము చేయవచ్చును. ఇంత చిన్న పనికోసం ఇంకా విచారమెందుకు?**

ఈ ప్రకారము జరాసంధుడు అతని వెంటనున్న రాజులు శిశుపాలుని ఓదార్చి తమతమ దేశములకు పయనమైరి. శిశుపాలుడు తన సేనతో తననగరమునకు బోయెను. కాని రుక్మిణి పెద్ద అన్నగారైన రుక్మి మాత్రం ఆ అవమానభారం సహించలేక తన చెల్లెల్ని అపహరించినందుకు ప్రతిగా ఒక అక్షౌహిణి సేనతో యుద్ధమునకు సిద్ధమై కృష్ణుని వెంబడించుచు ఇట్లనెను...



**భీష్మక మహారాజ పుత్రుడను బలశాలియైన నన్ను చులకనచేసి ఆ గొల్లవాడు మహా వీరుడినన్నట్లు వచ్చి నా సోదరిని రాక్షసముగా ఎత్తుకొని పోవుచున్నాడు. మన రథమును వాని వెనకనే వేగముగా తోలుడు. మంచివాడిగల శరములతో వాని మదము నణచి నా పరాక్రమమును జూపింతును.**

అని ఈ విధముగా రుక్మి శ్రీకృష్ణుని శక్తి సామర్థ్యముల నెరుగని వాడై తన సారధిని హెచ్చరించి తన రథమును హరివెంట నడిపించి దురుసుగా **"ఓ గోపాలకా! వెన్నలదొంగా! ఒక్క నిమిషము నిలువుము"** అని మూడు బాణములను తన వింటినుండి సంధించి, వేసి ఇట్లనెను...

**సీ॥ ఏది నీ వశంబు? ఏదిరా న్యాయంబు?**
**మము తూగువాడవా? మాయగాడ!**
**ఏది నీ నడవడి? ఎచటపుట్టితివీవు?**
**పెరిగితి వెచట? నీవూరదేది?**
**వావి వరుసలేదు, బాలగైకొంటివి**
**మానమర్యాదలు కానరావు**
**రాచలక్షణములు లవలేశమున్ లేవు**
**నేరుగా శత్రులన్ పోరలేవు**

**ఆ॥ గుణము లేదు నీకు కొమ్మ జోలికి రాకు**
**విడిచి పారిపొమ్ము, విడువవేని**
**శర పరంపరలను కురిపింతు నిప్పుడే**
**పోరునందు నీదు వుసురు గొందు.**

(పోతన గారి "మా సరివాడవా మా పాప గొనిపోయి" ఆధారంగా)



తా॥ నీవంశం ఏమిటి? నీవు పాటించే న్యాయం ఏమిటి? మాయల మారీ! నీవు మాతో తూగే వాడివేనా? నీ నడవడి ఏమిటి? నీవు పుట్టిందెక్కడ? పెరిగిందెక్కడ? అసలు నీకు ఊరు ఉందా? వావి వరుసలు లేవే? మాన మర్యాదలు కనబడవే? మా అమ్మాయి నీకు ఏమవుతుందిరా (నీ బావ శిశుపాలుడికి కాబోయే భార్య నీకు చెల్లెలు కదా!)? రాజుల లక్షణం కొంచెమన్నా ఉందా? నీ శత్రువులను ఎదుర్కోలేక పారిపోతున్నావా? నీకు గుణములే లేవుకదా! మా అమ్మాయి జోలికి రాకు. ఆమెని విడిచి పారిపో. లేకపోతే నా వాడి బాణములను కురిపిస్తాను. చస్తావు. యుద్ధంలో నీ ప్రాణాలు తీస్తాను. (తిట్టినట్లు కనిపిస్తున్నా అవన్నీ శ్రీకృష్ణ పరమాత్మ లక్షణాలే. ఆయనే మన అందరికీ తండ్రీ, భర్త, హంతకుడు కదా! తను పుట్టుకే లేనివాడు)



అని పలికిన ఆ రుక్మిని జూచి నవ్వి, శ్రీకృష్ణుడు ఒక బాణముతో వాని విల్లును ద్రుంచి, వాని దేహమును ఆరు పదునైన బాణములతో గాయపరచి, యెనిమిది శరములతో వాని రధమునకు బూన్చిన అశ్వములను తెగటార్చి, రెండు బాణములతో సారధిని యమపురి కంపి, మూడు బాణములతో వాని కేతనంబును (జెండాను) గూల్చి, ఆ రుక్మి వేఱొక్క విల్లందు కొనగా దానిని గూడా ఖండించి, ఖడ్గము, శూలము మున్నగు ఆయుధములను గైకొనగా వరుసక్రమమున వానినన్నింటినీ విఱచివేసెను. అంతట రుక్మి వేఱొక ఖడ్గంబును చేబట్టి కాననమందు కార్చిచ్చున బడెడి శలభంబు (మిడుత) వలె శ్రీకృష్ణునిపై దాడిజేయగా, కృష్ణుడు అతని ఖడ్గమును విఱిచి, కవచమును ఛేదించి, తానొక ఖడ్గంబున వాని తల తెగవేయుట కుద్యమించగా ఆ రుక్మిణీదేవి వెన్నుని పాదములు పట్టుకొని ఇట్లనెను.



**"ఓ సర్వలోక శరణ్యా! దయానిధీ! నీవు దేవదేవుడవు అయిన భగవంతుడవు. అజ్ఞానముతో ఈ విషయం గ్రహించలేని ఈ రుక్మి స్వయముగా నా అన్న. వీడు నీ యెడల మహాపరాధము జేసినాడు. కాని నాయొక్క మొగమును చూచి నన్ను మన్నించి వీనిని చంపకుండా విడనాడుము.**

**చం॥ తలతెగవేసి యీతనిని దండన సేయుట పాడి యైననున్**
**కలిగెడి పుత్ర శోకమది కాల్చును నా తలిదండ్రి నెమ్మదిన్**
**వెలగొనలేని భూవిభుడు విష్ణువు అల్లుడుయైన మోదముల్**
**తొలగును, మమ్ముజూచి పగతుండని యెంచకు వీనినో ప్రభూ!**

(పోతనగారి "కల్లలేదని విన్నవించుట...." ఆధారంగా)

తా॥ ఓ ప్రభూ! శ్రీకృష్ణా! ఈ దుర్మార్గునికి తలఖండించి సంహరించటం సరియైన శిక్షయే. కాని నా తల్లిదండ్రుల పెద్దకొడుకు వీడు. వీని మరణం నా తల్లిదండ్రుల మనస్సులను కాల్చిదహించి వేసే దుఃఖం కలిగిస్తుంది. తమకు జగన్నాథుడైన శ్రీకృష్ణ పరమాత్మే స్వయంగా అల్లుడయ్యాడన్న ఆనందం అంతరించి కన్నీరు మున్నీరవుతారు. మా మొఖము జూచి వీడిపై శత్రుత్వం విడిచిపెట్టు. మమ్ముదయ జూడుము.

అనుచు దుఃఖముతో పూడిపోయిన కంఠస్వరము తోను, భయముతోను కంపించు తనువుతోను, వంచుకొని యున్న వదనముతోను, చెవులపై నాట్యమాడుచున్న జడతోను, అశ్రుపూరితములైన కన్నులతోను, ఆ రుక్మిణీదేవి నమస్కరింపగా శ్రీకృష్ణుడు కరుణాంతరంగుడై తన బావయగు రుక్మిని సంహరింపుటను విరమించెను.



ఈ విధముగా ఆ రుక్మిని జంపక చిరునవ్వులు చిందించుచు **బావా! రమ్మని** వానిని బట్టి బంధించి వాని గడ్డమును, మీసమును, తలను ఒక కత్తివంటి బాణముతో పాయలు పాయలుగా గొఱిగి వికృత రూపునిగావించెను. అప్పుడు యాదవవీరులు శత్రుసేనలను పాఱద్రోలి అచ్చట జేరిరి. అక్కడ సగము జచ్చి కట్టువడియున్న రుక్మిని జూచి బలరాముడు దయతో బంధనములు తొలగించి శ్రీకృష్ణుని సమీపించి ఇట్లనెను...

**ఓ కృష్ణా! భీష్మకుని పుత్రుడైన ఈ రుక్మిని మంచిచెడ్డలెంచక ఇట్లు తలయు మూతియు గొఱుగుట న్యాయమా? బంధువునకు ఇట్లు చేయుట తల నరుకుట కంటే నీచము కదా! నీవు దైవ స్వరూపుడవు. కొందరిని శత్రువులని భావించి కీడు చేయువు. నీవు అందరియందును సమబుద్ధి కలిగియుండు పురుషోత్తముడవు గదా! ఇప్పుడీ రుక్మియందు వైరి**



**భావమెందులకు? అల్లుడైనను బంధువును మన్నించి రక్షించవలెను గదా!**

**ఓ కృష్ణా! చంపదగినంత తప్పుచేసినప్పటికీ బంధువులైన వారిని జంపతగదు. విడిచి పుచ్చవలెను. స్వజనులను చంపుట పాపమును కలిగించును. అదియును గాక, అవమాన భారముచే ఇదివరకే చచ్చిన వానిని చంపుట వ్యర్థము కదా! అని, బలరాముడు రుక్మిణికిట్లనెను.**

**మ॥ కలిగెన్ అన్నకు సిగ్గుచేటనుచు మా 'కన్నయ్య'పై క్రోధమున్**
**చెలగన్ జేయకుమమ్మ! నేడు విను, నే జెప్పేది నిక్కంబుగన్**
**కలుగున్ నిందలు బూజలైన మనకున్ కష్టాలు సమ్మానముల్**
**తొలి జన్మంబుల పాపపుణ్య ఫలమై దుఃఖింప వ్యర్థంబగున్.**



(పోతనగారి జగద్విఖ్యాతమైన "తోడంబుట్టిన వాని భంగమునకున్..." ఆధారంగా)

తా॥ ఓ రుక్మిణీదేవీ! మీ అన్నకు అవమానం చేశాడని మా కృష్ణయ్యమీద ఆగ్రహం పెంచుకోవద్దు. నేను సత్యం చెబుతున్నాను. మనకు (మానవులకు) మన పూర్వజన్మలలో మనం చేసుకున్న పాపముల ఫలితంగా తిట్లు, కష్టములు కలుగుతాయి. అదే రీతిగా పుణ్యములననుసరించి పూజించబడుట సన్మానములు కలుగుతాయి. దీనికి ఇప్పుడు విచారించుట నిరుపయోగము తల్లీ!

**స్వయముగా ఆ బ్రహ్మదేవుడే ఏర్పరచిన ధర్మమేమనగా, రాజులైన వారికి అపకారము చేసిన తమ బంధువులనైనా తాము చంపవచ్చును. ఈ న్యాయమే లేనిచో, రాజ్యము నేలువాని తమ్ములు దుర్మార్గులై తమ అన్నగారినే చంపుదురు.**

కొందరు తామే గొప్పవారమని అహంకరించు చుందురు. వారు తమ రాజ్యములను, ధనములను, ధాన్యములను, స్త్రీలను, ఆత్మగౌరవమును, ప్రభుత్వాదికారములను, కోరుకొనుచు ఐశ్వర్య మదోన్మత్తులై వ్యవహరించుచు ఇతరులను పలు విధముల బాధింతురు.

వినదగిన ఇంకొక మాట చెప్పెదను వినుము. దేహధారులైన మానవులకు సహజ సిద్ధముగానే వీడు నావాడు, వీడు పరాయివాడు, వీడు తటస్థుడు అని అభిప్రాయములేర్పడుచుండును. పెక్కు పాత్రలలోని జలములలో పెక్కు సూర్య చంద్రులు కనబడినట్లు పలు దేహములలో భాసించు ఒకే పరమాత్మ వివిధ ఆత్మలుగా వ్యక్తీకరింపబడు చుండును. వేర్వేరు కుండలలో వేర్వేరు ఆకాశము కనిపించిననూ ఉన్నది ఒక్క ఆకాశమే కదా! అదే ఆకాశము వివిధ పరిమాణము గల కుండలలో వివిధ



ప్రమాణములలో కనిపించుచుండును. అట్లే యాత్మ ఒక్కటైననూ అజ్ఞానముచే అనేక రూపములు గలదని భ్రమ కలుగును. అందుచేత నీవు, నేను, వాడు అని భేదములు కలుగును. జనన మరణములు గల ఈ శరీరము ఆకాశము, భూమి, వాయువు, తేజస్సు(వేడి), నీరు అను పంచభూతములచే తయారైనది. సత్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములుతోనూ, ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానము లను పంచ ప్రాణములతోను ఏర్పడినది. పరబ్రహ్మమునందు గలిగిన అవిద్యారూపమైన సంకల్పము చేత సృష్టించబడిన దగుటచే జీవిని ఈ సంసారమను మాయాజాలమున త్రిప్పుచున్నది. సూర్యుడాకాశమున ప్రకాశించినప్పుడే మన దృష్టికి వస్తు రూపములు గోచరించినట్లు, ఆత్మ మన శరీరములో వెలిగినప్పుడు మాత్రమే మన దేహేంద్రియములు పనిచేయును. అప్పుడే కన్ను, ముక్కు, చెవి, నాలుక,



చర్మము అను మన పంచేంద్రియమ్ములూ మనకు దృష్టి, వాసన, వినికిడి, రుచి మరియు స్పర్శ అను ఐదు జ్ఞానములనిచ్చును. కాళ్ళు, చేతులు, నోరు, మలమూత్రములు విసర్జన చేయు అవయవములు అను కర్మేంద్రియములు దేహవ్యాపారములు నిర్వహించు చుండును. ప్రాణములేని శరీరము ఆత్మ చైతన్యము లేనిదై కుళ్ళిపోయి నశించును. అయితే ఆత్మ ఈ దేహము మనస్సులతో, కలయికలకు గాని ఎడబాటులకు గాని సుఖదుఃఖములను పొందదు. తటస్థముగా కేవలము సాక్షీభూతునిగా ఈ దేహమున నెలకొని యుండును. పెరుగుట, తరుగుట చంద్రకళకే గాని చంద్రునికి కానట్లు జనన మరణములు దేహమునకే గాని, దేహధారియైన ఆత్మకుండవు. నిద్రించినవాడు కలలోని అనుభవములన్ని మనస్సుతో అనుభవించి, అదే అనుభవమును దేహముతో పొందినట్లు భ్రమించును. అట్లే జ్ఞానహీనుడు ఈ



సంసారమును స్వప్నమువలె క్షణభంగురమని దెలియలేక, ఈనాడుండి రేపు ఉండని వస్తువులపై వ్యామోహము పెంచుకొని సుఖదుఃఖములననుభవించుచున్నాడు. ఇది ఒక వింత కావున...

ఓ రుక్మిణీ! అజ్ఞాన జనితమైన దుఃఖంబును విడనాడి విజ్ఞాన దృష్టితో యోచింపుము. నీవంటి ప్రజ్ఞావంతురాలు అజ్ఞానులవలె వేదనొందుట తగునా?

ఈ ప్రకారముగా బలరాముని జేత ప్రబోధింపబడినదై ఆవైదర్భి విచారంబును విడనాడిన దాయెను. రుక్మి అన్నియూ పోగొట్టుకొని జీవములతో మిగిలినవాడై బంధవిముక్తుండయ్యునూ, తనకు కలిగిన వికార రూపమునకు చింతిల్లి శ్రీకృష్ణుని గెలిచేదాక కుండిన నగరమునకు బోనని ప్రతిజ్ఞ చేసి అరణ్యములలోనే తిరుగాడు చుండెను.

శత్రుమూకలను గెలిచిన శ్రీకృష్ణుడు తన స్వజనులందరూ తనను పొగడుచుండగా రాజదర్పముతో రుక్మిణీదేవిని ద్వారకా నగరమునకు తీసుకొనివచ్చెను.

అప్పుడా యాదవ విభుడైన శ్రీకృష్ణుని ద్వారకా నగరము వివాహ సంరంభములతో నిండిపోయినది. ఎక్కడ జూచినా గాన, వాద్య, నృత్య వినోదభరితమై కళకళలాడుచుండెను. ప్రతిగృహమూ ఆ ఇంటిలోనే పెళ్ళి జరుగుచున్నదా అన్నట్లు అలంకరింపబడి, జనములతో క్రిక్కిరిసి యుండెను. రాజులందరూ మదగజముల నధిరోహించి వచ్చినందున ఆ మదజలము యొక్క సుగంధము శుభ సూచకముగా జల్లిన పన్నీటి సుగంధముతో మిళితమై మార్గంబులు కొంగ్రొత్త పరిమళంబులతో విరాజిల్లుచుండెను. ప్రతిద్వారంబున శుభకార్య ద్యోతకమైనట్లు పోకచెట్లు అరటిచెట్లు



కట్టబడినవి. పసుపు, కర్పూరము, కుంకుమలతో రంగురంగుల రంగవెల్లులు (ముగ్గులు) పెట్టిరి. అగరుతో ధూపములు వేసిరి. ప్రతిచోటులోనూ దీపకుంభములు వెలసినవి. రాజ సౌధంబు మాత్రమేగాక ప్రతి ఇంటి అరుగులు కూడ శోభాయమానంగా అలంకరింపబడినవి. పందిరి గుంజలతో ప్రతి ఇల్లూ పెళ్ళివారి విడిది గృహమైనట్లు కళ కళలాడినది. రంగురంగుల వస్త్రములతోను, పూదండలతోను, రత్నమాలా తోరణములతోను నగరము నిండిపోయినది. గాలికి రెపరెపలాడుచున్న జెండాలతో ప్రతి గృహము చూడముచ్చటగానుండెను. అంత....

**సీ॥ స్థిరమైన కీర్తిని ధరియించు చినదాని,**
**మనసు దోచిన సతిన్, మానవతిని,**
**వంశగారముతో వచ్చిన మరియాద**
**గంభీరతత్వంబు గలుగుదాని,**



**సాధు బాంధవులను సత్కరించెడి దాని,**
**ఇష్ట సంపదలెల్ల నిచ్చుదాని,**
**ఘోర దారిద్ర్యంబు గూల్చు దేవేరిని,**
**పుణ్యకార్యంబుల బూను దాని**

**తే॥ మేటి అంబరాభరణాల మెరయు దాని,**
**ఉత్తమంబైన గుణములు యున్నదాని,**
**భీష్మకుని పుత్రి రుక్మిణిన్ పెండ్లియాడె**
**దేవకీనందనుడు హరి తేజమలర.**

(పోతనగారి "ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె..." ఆధారంగా)

తా॥ స్థిరమైన కీర్తి కలిగిన చిన్నారిని, మనస్సును దోచుకున్న భార్యను, అభిమానవతిని గొప్ప వంశ



ప్రతిష్ఠ కలిగిన దానిని, గంభీరమైన స్వభావం కలిగిన దానిని, సజ్జనులను బంధువులను సత్కరించెడి దానిని ఇష్టమైన సౌభాగ్యములనిచ్చుదానిని (లక్ష్మీ దేవియే కదా!), ఘోరమైన దారిద్ర్య బాధను తొలగించు దానిని సత్కార్యములను చేయుదానిని, విలువైన వస్త్రములతోను నగలతోను శోభించుదానిని సద్గుణములు కలిగిన దానిని, భీష్మకుని సుపుత్రియైన రుక్మిణీదేవిని, దేవకీనందనుడైన శ్రీకృష్ణుడు శోభాయమానంగా పెండ్లాడినాడు.

అమితమైన కరుణతో ప్రజలను రక్షించు స్వభావముగలవారునూ, గౌరవింపదగిన తేజస్సుతో విరాజిల్లు వారునూ, అయిన ఆ రుక్మిణీ కృష్ణులను భార్యలతో గూడివచ్చిన పురజనులు సంతోషముతో చాల కానుకలనందించిరి.

శ్రీకృష్ణుని పెండ్లి సందర్భమున కేకయ రాజులు, కురు వంశస్థులైన భూపాలురు, సృంజయ వంశ నృపాలురు, యదువంశ భూవిజులు, విదర్భ రాజ పరివారము, కుంతీ దేవి బందుగులు (కురు పాండవులు) బంధు ప్రీతితో విచ్చేసి మనఃపూర్వకముగా ఆనందించి, ఇట్లా అనుకొన్నారు.

ఉ॥ ఎవ్వడు పెండ్లియాడెగొని ఎత్కుక వచ్చిన
ప్రేయసీమణిన్
ఎవ్వడు గెల్చె తానరుల ఎత్తిన వింటిని
ఎత్తినట్లుగా
ఎవ్వడు మంగలై గొరిగె నీ విధి బావకు
భంగపాటునన్
ఇవ్విధి సేయు కృష్ణునికి ఏది అసాధ్యము
ఈజగంబునన్

(పోతనగారి "హరి ఈ తెరగున...." ఆధారంగా)



తా॥ తనను ప్రేమించిన ప్రియురాలిని ఎత్తుకొనిపోయి ఎవడన్నా పెండ్లి చేసుకొన్నాడా, ఎత్తిన విల్లు ఎత్తినట్లుగానే ఎడతెగని బాణముల వర్షం కురిపించి శత్రువులను ఎవడన్నా గెలువగలిగాడా? స్వంత బావగారిని (భార్య అన్నగారిని) ఎవడన్నా (తల, గడ్డం, మీసం) మంగలి వాడిలాగా గొరిగిపెట్టాడా? అవమానం చేశాడా? ఈ ప్రపంచంలో ఇవన్నీ చేయగలిగినవాడు శ్రీకృష్ణుడొక్కడే. ఆయనకు అసాధ్యం ఏముంటుంది?

ఓ పరీక్షిన్మహారాజా! ఆదిలక్ష్మియైన రుక్మిణీదేవితో గలిసి సుఖముగా సంసారము జేయుచున్న శ్రీకృష్ణ పరమాత్మునిజూచి ద్వారకా నగరంబునందున్న ప్రజలెల్ల శత్రుభీతిలేని వారై ఆనందమున నుండిరి.

మంగళములతో జగములు వర్ధిల్లెను.



## మంగళము

కం॥ మంగళమమా! రుక్మిణి!
మంగళకరుడైన వేణుమాధవునికిన్
మంగళమౌ ఓ అలమేల్
మంగమ్మా! వేడుకొనెద మము బ్రోవంగన్

